# సర్వం జగన్నాథం



విడిదిలో హడావిడిగా తిరుగుతున్న ఆవిడ ఒక్కసారిగా ఆగిపోయింది. ఆవిడ తనని తదేకంగా గమనించటం చూసిన ఆయన కూడా ఆశ్చర్యపడ్డాడు.

ముహూర్తం వేళ సమీపిస్తున్నది. మగ పెళ్ళివారు విడిది వదలి పెళ్ళి మంటపం దగ్గరకు వెళ్ళవలసిన సమయం అసన్నమవుతున్నది. ఆడపెళ్ళి తరుపువారు మేళతాళాలతో మగపెళ్ళివారిని పెళ్ళి యింటికి తీసుకుపోవటానికి వచ్చారు. ఆవిడ ఆ ప్రయత్నంలో వుండగానే - ఎదురుగా ఆయన కనపడ్డాడు. ముందు ఆయన్ని చూసి గుర్తు పట్టలేకపోయింది. క్రమంగా గుర్తుపట్టి ఆశ్చర్యపోయింది. కొంచెంసేపటికి ఆశ్చర్యంలోనించి తేరుకుంటూ ముందుకు నడిచింది.

ఇదే నలభై అయిదేళ్ళ క్రితం అయితే ఆవిడ సిగ్గుపడేది. తల వంచుకొని పారిపోయేదేమో! కాని ఈనాడు ఆ అవసరం లేదు. అందుకే ధీమాగా ముందుకు నడిచింది. అయినా కాళ్ళల్లో ఏదో వణుకు, మనసులో ఏదో ఆరాటం. ఐనా మనిషిలో అదో ఆనందం.

★

ఆయనా ఆమెను తదేకంగా అలానే చూస్తున్నాడు. ఇదే నలభయ్యయిదేళ్ళ క్రితం అయితే

ఆయన మొహమాట పడేవాడు. ఎవరన్నా చూస్తున్నారేమో నని భయపడేవాడు. కాని యీనాడు ఆ అవసరం లేదు. అందుకే ధైర్యంగా ఆమె వేపు చూశాడు. అయినా కళ్ళలో ఏదో నదురు, పెదవుల్లో ఏదో వణుకు. అయినా మనిషిలో ఏదో ఉత్సాహం.

సరాసరి వచ్చి ఆయనకు ఎదురుగా ఆగింది ఆవిడ. ఓ క్షణం తదేకంగా చూసింది.

"ఎన్నాళ్ళకి చూశాను జగన్నాథం" - మాటలు కూడబలుక్కుంటూ అన్నదావిడ.

"నువ్వు ఆనాటి పార్వతివే అంటే నమ్మలేకుండా వున్నాను సుమా!" నెమ్మదిగా అన్నాడాయన.

ఆవిడ చిన్నగా నవ్వింది.

"నేనీనాడు పార్వతిని కాను జగన్నాథం - పార్వతమ్మ గారిని".

ఆవిడని తేరిపార చూశాడు జగన్నాథం. ముఖం మడతలు పడుతున్నది. తల చాలవరకు పండిపోయింది. మనిషిలో పూర్వపు పటుత్వం, బిగి లేవు. కళ్ళల్లో చిలిపితనం, చురుకుదనం బదులు, అదో విధమైన లాలిత్యం, వాత్సల్యం తొణికిసలాడుతున్నాయి. కళ్ళ క్రింద నల్లని వలయాలు ఏర్పడ్డయ్.

"చాల మారిపోయావ్ పారూ! వృద్ధాప్యం మీద పడింది" అన్నాడు జగన్నాథం.

ఆవిడ మళ్ళా నవ్వింది.

"పారూ అనే పిలుపు ఎన్నాళ్ళకి విన్నాను జగన్నాథం - నువ్వలాపిలిస్తే నా మనసు ఆ రోజుల్లో పురకలు వేసి పరుగులు తీసేది. కాని.... యీ నాడు నువ్వు అలా పిలుస్తుంటే ఎందుకో నవ్వు వస్తున్నది. మన మనవలూ, మనవరాళ్ళూ నువ్వు నన్నలా పిలవటం విని అపార్థం చేసుకోకపోయినా, ఎగతాళిగా నవ్వుకుంటారు-"

కొంచెం సేపు ఆగి ఆవిడ మళ్ళీ అన్నది.

"నా ఒక్కదానిమీదే వృద్ధాప్యం పడిపోయినట్లు మాట్లాడతావేం - నువ్వూ ముసలివాడవయి పోయావ్ సుమా!" అన్నదావిడ ఆయన్ని దీక్షగా చూస్తూ.

ఆయన ముఖం ముడుతలు పడింది. తల తెల్లగా ముగ్గుబుట్టలా వుంది. మనిషిలో పూర్వపు శక్తి, వుత్సాహం లేవు. కళ్ళల్లో కవ్వింపూ - మెరుపూ బదులు అదో విధమైన అప్యాయత, కరుణ తొణికిసలాడుతున్నయ్ - కళ్ళకి మందమైన జోడు కూడా వచ్చింది.

"అవును పారూ... యిద్దరం ముసలి వాళ్ళమయిపోయాం!" నిట్టూర్చాడాయన.

"ఏమండీ పార్వతమ్మగారు! యిక్కడున్నారా - రండి మీ కోసమే చూస్తున్నాం త్వరగా!"

కేకేసింది ఒక ముత్తయిదువ.

"అఁ! వచ్చే..... అది సరేగాని జగన్నాథం - మీ ఆవిడ కూడా పెళ్ళికి వచ్చిందా?" ఆత్రంగా అడిగింది ఆవిడ.

"లేదు పారూ... అది చనిపోయి కూడా పదేళ్ళయింది...."

ఆవిడ అనుకున్నట్టుగా ఆయన కళ్ళు తుడుచుకోలేదు.

"మరి మీ ఆయన్ని చూపించవూ!" - ఆవిడ నుదిటి మీద పెద్ద సైజు కుంకుమ బొట్టుని చూస్తూ అడిగాడాయన.

మళ్ళా పార్వతమ్మగారిని కేకేసిందో ముత్తయిదువ.

"అఁ! వచ్చే.... అదంతా ఒక కథ జగన్నాథం - చెబుతాలే - మళ్ళా కనబడతా" చక చకా వెళ్ళిపోయింది ఆవిడ.

ఆ క్షణం నుంచీ ఇద్దరినీ ఆలోచనలు ఈగల్లా ముసురుకున్నాయ్.

యిద్దరూ పరధ్యాన్నంగానే వున్నారు.

మళ్ళీ ఆవిడని పెళ్ళి పందిట్లో చూశాడు జగన్నాథం. పందిట్లో ఆడవాళ్ళ దగ్గర చాల చనువుగా తిరుగుతుండగా చూశాడు.

ఆవిడా జగన్నాథాన్ని గమనించి చిన్నగా నవ్వింది. జగన్నాథం తెల్లని దుబ్బు మీసాల వెనుక చేసిన మందహాసం ఆవిడా గమనించకపోలేదు.

పెళ్ళి అనుకున్నదానికన్నా కూడా బాగా జరిగింది. భోజనాలు చేస్తుండగా- లడ్ల పళ్ళెం పట్టుకుని వచ్చింది ఆవిడ. రెండు లడ్లు ఏకంగా ఒక్కసారి విస్తట్లో పడేసరికి విస్తుబోయి తలెత్తాడు జగన్నాథం.

ఆవిడ నవ్వుతూ - "తిను జగన్నాథం! లడ్లు ఆరోగ్యానికి భంగకరం కాదులే" అన్నది.

ఆయన నవ్వి, "అది కాదు పారూ - పార్వతీ ఎక్కువ తింటే మళ్ళీ అరగదు - అనవసరంగా బాధపడాలి. అదీకాక నమలటానికి నాకిప్పుడు పళ్ళు ఏవీ?" - నోరు తెరిచాడాయన.

ఆవిడా నవ్వి - "నాకు ఏ మాత్రం తీసిపోనంటావ్" అంటూ వెళ్ళిపోయింది.

జగన్నాథం మనసు మనసులో లేదు. ఆవిడతో చాలా మాట్లాడాలి. చాలా - చాలా కాని - ఎలా.... ఆ రోజల్లా ఆయన ఇదే ఆలోచనలో వున్నాడు. ఆవిడ ఎదురుపడితే చాలనుకున్నాడు. కాని వీలుకలగలేదు-

"రండి తాతయ్యగారూ - ఊరేగింపు బయల్దేరబోతున్నది" అన్నాడు ఒకాయన హడావిడిగా వచ్చి.

ఉలిక్కి పడ్డాడు జగన్నాథం. ఆయనికి తాతయ్యగారూ అని పిలిపించుకోవటం అలవాటే అయినా... పార్వతి వూహల్లో వున్న ఆ సమయంలో - తనని అవమానిస్తున్నట్లే అనుకున్నాడాయన. ఆ పిలుపు ఆయనకి అదోలా వుంది.

"నేను రాను!" - సూటిగా అన్నాడు జగన్నాథం కొంచెం కోపంగా.

బిత్తరపోయాడు ఆ పిలచిన పెద్దమనిషి. మారుమాట్లాడక వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాల తర్వాత యింకొక ఆయన వచ్చి- "పెద్దవారు. మీరు కనీసం మా కోసమయినా రావాలి. వూరేగింపులో మీలాటి పెద్దలు వుంటేగాని బాగుండదు" అన్నాడు.

జగన్నాథం ఒక్క క్షణం సర్దుకుని - "సరే వస్తున్నాను.... మీరు పదండి!" అన్నాడు.

ఆయన ఆనందంగా వెళ్ళిపోయాడు.

పార్వతిని గురించి వస్తున్న ఆలోచనలతో తను యువకుడినయానను కుంటున్న జగన్నాథంకి 'తాతయ్యగారు, పెద్దవారు' అని అంతా అంటూంటే తేళ్ళూ - జెఱ్ఱులూ పాకినట్టుంది - తనని అనవసరంగా పెద్దవాడిని చేసేస్తున్నారేమోననిపించింది.

బయట నుంచి మళ్ళా పిలుపు వచ్చింది. ఇక తప్పదన్నట్టుగా లేచి ఆయన ఊరేగింపులో కలిశాడు.

వంద గజాలైన నడవకముందే నీరసం అనే సాకు చెప్పి వెనక్కి తిరిగాడు జగన్నాథం.

పందిరి అంతా దాదాపు ఖాళీగా వుంది. ఏవో పనులు చేసుకుంటున్నారు తప్ప..... ఎవరూ లేరు. ప్రక్కనే వున్న మెట్లు ఎక్కి డాబా మీదకు వచ్చాడు జగన్నాథం.

నలభయి అయిదేళ్ళ క్రితం పార్వతి యవ్వనంలా విరగకాస్తున్నది వెన్నెల. ఆనాటి పార్వతి వెలుగు జిలుగులు గుర్తుకు తెచ్చుకుంటున్న జగన్నాథానికి తెల్లని చందమామలోని మచ్చ పార్వతికీ - చంద్రుడికీ పోలికేమిటి అంటున్నట్లుగా వున్నది. ఆ నాటి పార్వతి శరీరంలాగా ఏపుగా పెరిగిన కొబ్బరిచెట్లు, చల్లని గాలిని యిస్తూ శరీరాన్ని గిలిగింతలు పెడుతున్నవి. అక్కడే వాల్చివున్న మంచం మీద పడుకుని ఊహాలోకంలో తేలిపోతున్నాడు ఆయన.

"ఏం జగన్నాథం! పెద్ద ఎత్తు వేశావే ఒంటరిగా కలుసుకోవటానికి!" అన్నది పార్వతి అప్పుడే వస్తూ.

"ఎత్తూ లేదు - నా మొఖం లేదు. కొంచెం నీరసంగా వుంటేనూ...." చిన్నగా గొణిగాడు

జగన్నాథం.

ఆవిడ బిగ్గరగా నవ్వింది.

"నువ్వేం మారలేదు జగన్నాథం - ఆ నాటి అభిమానం, అతిశయం, నీలో యింకా తగ్గలేదు, నేను ప్రొద్దుటి నుంచీ నీ వరస కనిపెడుతున్నానులే! నేను ఒంటరిగా కనబడుతానేమోనని నువ్వు అదే పనిగా ఎదురుచూడటం నేను గమనించలేదనుకున్నావా....."

"మరి నువ్వు వూరేగింపుకు వెళ్ళలేదేం!"

"ఎందుకు వెళ్ళలేదు - నువ్వు వెనక్కి తిరిగిరావటం చూసి, నేనూ వెనక్కి తిరిగాను" ఆవిడ మళ్ళా నవ్వింది.

"కూర్చో పారూ!" అన్నాడు జగన్నాథం, మంచం మీద కొద్దిగా ప్రక్కకు జరుగుతూ.

"జగన్నాథం - మనం చాల పెద్దవాళ్ళమయిపోయాం, మరచిపోకు!" అంటూనే నేల మీద పిట్టగోడకి ఆనుకుని కూర్చుంది ఆవిడ.

జగన్నాథం నవ్వాడు. "ఈ వయసులో యిక్కడ కూర్చున్నా పరవాలేదులే పారూ - ఇవి ఆ రోజులు కావులే!".

అతని మాటకు అడ్డొస్తూ అన్నది - "నీ చిలిపితనం ఇంకా పోలేదు జగన్నాథం. అది సరే - మనం కలుసుకుని ఎన్నాళ్ళయింది?"

"నలభయి అయిదేళ్ళన్నా అయివుండదూ!" అన్నాడు జగన్నాథం, గతం మరీ లోతుగా వుండటం గమనించి-

ఆవిడా ఏదో ఆలోచనలో పడింది.

"నీకెంతమంది పిల్లలు"? అడిగిందావిడ.

"ఒక్కడే కొడుకు - వాడి దగ్గరే వుంటున్నాను - నీకు?" అడిగాడాయన.

"ఇద్దరు కూతుళ్ళు - రెండో అమ్మాయి మొగుడి అన్నయ్య కూతురికే యిప్పుడు పెళ్ళి - అన్నట్టు నీకు మగపెళ్ళి వారెలా తెలుసు?"

"సరే అడిగావ్. నా ప్రాణ స్నేహితుడు రామబ్రహ్మం మనవడే కదూ పెళ్ళికొడుకు - నే రాకపోతే ఈ పెళ్లి జరుగుతుందా అసలు, నేనంటే గొప్ప ప్రేమ వాళ్లకి".

"అవును నువ్వంటే ప్రేమలేనిదెవరకి - ఆ రోజుల్లో నేనూ నీ మీద ఆశలు పెంచుకోటానికి కారణం కూడా అదే కదూ!"

జగన్నాథం మాట్లాడలేదు.

"ఏమయితేనేం మళ్లా యిన్నాళ్ల తర్వాత నిన్ను కలుసుకుంటానని అనుకోలేదు జగన్నాథం".

"అవును ఎలా అనుకుంటాం? నీ పెళ్ళితో నీదో దారీ, నాదో దారి అయింది, అన్నట్టు మీ ఆయనేడీ?"

"ఏం చెప్పను జగన్నాథం రెండేళ్ళయిందేమో - కాశీకి వెళ్ళి తిరిగి రాలేదు. వుత్తరమూ లేదు - యింకా నా అయిదవతనం వుందనుకుంటూ అలానే నెట్టుకొస్తున్నాను"

నిట్టూర్చాడాయన.

"నీకూ జీవితంలో కష్టాలున్నాయన్న మాట!" అన్నాడు చివరికి.

"అదేమిటి - నువ్వు నన్ను కాదన్న నాటినుంచే నాకు కష్టాలు ప్రారంభమయినయ్"

ఆయన మాట్లాడలేదు.

కొంచెం సేపు ఆగి, "జగన్నాథం, నీకో తమాషా కథ చెప్పనా!" అడిగిందావిడ.

"ఊఁ!" అన్నాడు జగన్నాథం. పట్టేసిన నడుము సరిచేసుకుంటూ.

"కాలేజీలో చదివే ఒక అమ్మాయి - అబ్బాయి ప్రేమించుకొన్నారు. ఆ అమ్మాయి వైజాగ్‌లో చదువుతున్నది. ఆ అబ్బాయి హాస్టల్లో వుండి చదివేవాడు. వాళ్ళ ప్రేమ పక్వానికి కూడా వచ్చింది".

"ఇది కొద్ది మార్పులతో మన కథలానే వుంది!" అన్నాడు జగన్నాథం భుజాలు తడుము కుంటూ.

"ముందు విను జగన్నాథం! వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోవాలని కూడా నిశ్చయించుకున్నారు. ఆ అబ్బాయి అమ్మాయి వాళ్ళ వాళ్ళతో ఆ విషయం మాట్లాడాడు కూడాను. ఆ అబ్బాయి కూడా వాళ్ళకి నచ్చాడు. కాని అసలు గొడవ అక్కడే వచ్చింది. ఇరు పక్షం వారూ కులం ఒకటే అయినా శాఖ వేరు. సనాతనులైన ఆ కుటుంబాల వారికి ఆ వివాహం అంతగా నచ్చలేదు. దానితో వాళ్ళ జీవితం దుఃఖాంతం అయిపోయింది".

"పారూ! ఇది పూర్తిగా మన కథే! అది --"

ఆయన మాటకు అడ్డువస్తూ అన్నది పార్వతమ్మ.

"పూర్తిగా చెప్పనీ జగన్నాథం. ఆ అమ్మాయి ఏం చేసిందీ - అతనితో గట్టిగా చెప్పేసింది.

ఏమనీ - నువ్వు నన్ను కాదంటే నేను బ్రతకలేను. చేసుకుంటే నిన్నే చేసుకుంటాను అనీ. ఆ అబ్బాయికి ఆ అమ్మాయంటే ఇష్టమే. కానీ పెద్ద వాళ్ళ మాట కాదనలేడు. ఏ సంగతీ తేల్చుకోలేక సతమతమవుతున్నాడు - ఆ అమ్మాయి యీ మౌనం భరించలేకపోయింది. చివరికి ఎంతవరకు తెగించిందో తెలుసా? అతనితో లేచిపోయి, వేరే కాపురం పెడదామని అతనితో గట్టిగా అన్నది కాని అతను దానికీ ఒప్పుకోలేదు. అసలు....."

"పారూ! ఇక చాల్లే ఆపు - అసలే జరిగిన పొరబాటుకు నేను అప్పటి నుంచీ యిప్పటి దాకా బాధపడుతున్నాను. ఎందుకు నన్నింకా బాధపెడతావ్. పొరపాటు జరిగిపోయింది. నాకానాడు మా వాళ్ళని ధిక్కరించే ధైర్యం లేకపోయింది. నిన్ను లేవదీసుకు వెళ్లే ధైర్యం అసలే లేదు. నాకు యిష్టంలేని పెళ్ళి జరుగుతుంటే ఎంత బాధపడ్డానో తెలుసా - నువ్వు మీ వాళ్ళతో ఆ వూరు వదలి వెళ్ళిపోయినా నా హృదయంలో నుంచి మాత్రం నువ్వెక్కడికీ వెళ్ళలేదు. పారూ! నిజం"

ఆవిడ ఒక నిట్టూర్పు విడిచింది.

"జగన్నాథం! నేనూ నీ కోసం ఎన్నాళ్ళు విలపించానో తెలుసా! కాని కేవలం నీ అధైర్యం వల్లనే అలా జరిగిందంటాను. ఆడపిల్లని లేవతీసుకుపోవటం తప్పే కావచ్చు - కాని కులాలు, శాఖలు అంటూ జీవితాలు పాడుచేసుకోవడం కన్నా అది చాల నయం. ఏమంటావ్?"

"ఏమంటాను - జరిగింది పొరపాటేనని ఒప్పుకుంటున్నానుగా!" బాధగా అన్నాడు జగన్నాథం.

"జగన్నాథం యిందాక నేను చెప్పిన కథ మన దొక్కరిదే కాదు - చాలమంది కథ - ఆనాటిదే కాదు. ఈనాటిది కూడా. ఇప్పుడదే సమస్య నా మనవడు ప్రసాద్‌కి కూడా వచ్చింది".

ఆశ్చర్యంతో తల ఎత్తాడు జగన్నాథం.

"అవును జగన్నాథం! ప్రసాద్ విషయంలో కూడా సరిగ్గా ఇలానే జరిగింది. వాడు ఏం చేయాలో నిశ్చయించుకోలేక నన్ను సలహా అడిగాడు. నేనంటే వాడికి చాల ప్రేమ. నా మాట కాదనడు. కాని వాడికేమని చెబుదామా అని ఆలోచిస్తున్నాను".

"ఇంకా ఆలోచన ఏమిటి పారూ! ఒకసారి జరిగిన పొరపాటు - ఏవో పిచ్చి నమ్మకాలతో మళ్ళీ చేయటమా! వద్దు! వెంటనే పెళ్ళికి ఒప్పేసుకోండి - మనలాగా వాళ్లూ బాధపడకుండా చూడటం నీ ధర్మం కాదూ".

"అవును జగన్నాథం. నువ్వు చెప్పింది నిజమే! కాని ఆ బాధ్యత నా ఒక్కదానిదే కాదు నీదీ వుంది. మా వాడు ప్రేమించిన పిల్ల ఎవరో కాదు నీ కొడుకు కూతురు వసంత. యూనివర్శిటీలో

పరిచయం ప్రేమగా మారిందట. అమ్మాయి తరపువాళ్ళు అభ్యంతర పెడుతున్నారనీ, ఆ అమ్మాయి వీడు కాదంటే బ్రతకదనీ... ఆ నాడు నేను అన్నమాటే ఈనాడూ ఆ అమ్మాయి అన్నదనీ తెలుసుకొని నేను బాధపడ్డాను. కాని నువ్వే ఆ పెద్ద మనిషివని తెలియలేదు. మధ్యాహ్నం మా వాడు నిన్ను పందిట్లో చూసి గుర్తుపట్టి నాతో అంతా చెప్పాడు. ఏం జగన్నాథం, మాట్లాడవు! మనకు జరిగిందే వాళ్ళ విషయంలోనూ జరగాలంటావా?''

తల క్రింద చేయి పెట్టుకుని ఆలోచిస్తున్న జగన్నాథం ఒక్కసారి లేచి కూర్చున్నాడు.

చటుక్కున పార్వతమ్మ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

''లేదు పార్వతీ అలా జరగటానికి వీలులేదు! నేనీ వివాహానికి మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నాను. నా కొడుకుచేత కూడా ఒప్పిస్తాను. నువ్వు బెంగపడకు. ప్రమాణం చేస్తున్నాను!''

ఆవిడ కళ్ళల్లో వెలుగు కనిపించింది.

''ఆనాడు నువ్వు చేయలేని ధైర్యం ఈనాడయినా చేస్తున్నందుకు సంతోషంగా వుంది జగన్నాథం!'' అన్నది ఆయన చేతిని మృదువుగా వత్తుతూ -

ఆయన నవ్వాడు.

''ఆఁ! నాదేముంది పార్వతీ - అది వాడి దయ. సర్వం జగన్నాథం!''

''అవును! సర్వం జగన్నాథం'' అన్నది ఆవిడ కూడా నవ్వుతూ-

*(ప్రజామత వార పత్రిక: అక్టోబర్ 25, 1970)*